సాక్షి నంద్యాల

ఆదివారం । 13 । జూలై । 2025



.. పంచుకుతిన్నారు!

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 2024-25లో క్లస్టర్ డెమాన్‌స్ట్రేషన్‌లను కాగితాలపై చూపి నిధులను కొల్లగొట్టినట్లు వ్యవసాయశాఖలో జోరుగా చర్చ జరుగుతోంది.

8లో ▸



మాతృభాష పరిరక్షణ ..

మాతృభాష పరిరక్షణ మనందరి బాధ్యత అని విశ్రాంత ఐఏఎస్ ముక్తేశ్వరరావు అన్నారు. కర్నూలులో రాష్ట్ర స్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు శనివారం ప్రారంభమైంది.

8లో ▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.13
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:76.912
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:46,579
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:36,026

నిరుద్యోగ భృతి ఏదీ.. ఆడబిడ్డ నిధి ఇంకెప్పుడు!



'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, పార్టీ పరిశీలకులు కల్పలతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు

- హామీలు ఇవ్వడం ఎగ్గొట్టడం చంద్రబాబు నైజం
- సూపర్ సిక్స్ పథకాలు ఇచ్చేశానని చెప్పడం సిగ్గుచేటు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కాటసాని, పరిశీలకులు కల్పలతారెడ్డి

బనగానపల్లె: 'ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత దాట వేయడం సీఎం నారా చంద్రబాబు నాయుడి నైజం.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. ఆడబిడ్డ నిధి అమలు ఊసెత్తడం లేదు.. బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పార్లమెంట్ నియోజక వర్గ పార్టీ పరిశీలకులు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి పిలుపునిచ్చారు. బనగానపల్లె పట్టణంలోని ధనలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో శనివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయినా ఎప్పుడూ మేనిఫెస్టో అమలు చేయలేదన్నారు. డైవర్షన్ రాజకీయాలతో ప్రజలను మభ్యపెట్టడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు ఇస్తామని, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ మరిన్ని పథకాలను చంద్రబాబు మరిచి పోయి అన్ని హామీలు నేరవేర్చినట్లు చంద్రబాబు ప్రకటించడం సిగ్గు చేటన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' అనే క్యూఆర్ కోడ్ ఉండే పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా విఘ్నేశ్వరరెడ్డి, కాటసాని ప్రసాదరెడ్డి, గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, అబ్దుల్‌ఖైర్ తదితరులు కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

మోసం చేసి సంబరాలా!

ఎన్నికల సమయంలో హామీలతో ప్రజలను నమ్మించి గెలుపొందిన కూటమి నేతలు అభివృద్ధిని, సంక్షేమాన్ని విస్మరించారు. హామీలు అమలు చేయకుండా సుపరిపాలన అంటూ సంబరాలు ఎందుకు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదు. చంద్రబాబు మోసాలను ఇంటింటికీ తీసుకెళ్దాం. ప్రజలు మోసపోయిన విధానాన్ని క్యూఆర్ కోడ్‌తో వివరిద్దాం.

– పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు కల్పలతారెడ్డి

రైతు సంక్షేమం ఏదీ

కూటమి ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించింది. ఏడాదైనా పెట్టుబడి సాయం ఇవ్వలేదు. వచ్చే ఎన్ని కల్లో తప్పనిసరిగా కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారు. 2019 –24 వరకు బనగానపల్లె నియోజకవర్గంలో కాటసాని రామిరెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులు జిల్లాలో డోన్ తర్వాత స్థానంలో నిలిచాయి. గోరుకల్లు రిజర్వాయర్‌ను తీసుకువచ్చిన ఘనత కాటసాని కుటుంబానిదే.

– జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ప్రజలపై బీసీ ట్యాక్స్

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలపై బీసీ ట్యాక్స్ వేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల ద్వారా టన్ను ఇసుకపై రూ. 250 వసూలు చేస్తున్నారు. క్రషర్ యజమానులు, వ్యాపారుల నుంచి కోట్లు దండుకుంటూ పంచాయతీ అభివృద్ధి అని చెప్పుకోవడం విడ్డూరం. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారు. మేము అధికారంలోకి వచ్చినప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తాం.

– మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

రేపటి నుంచి ఎస్సార్బీసీకి నీరు

పాణ్యం: గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఎస్సార్బీసీకి సోమవారం నుంచి నీటిని విడుదల చేస్తామని ఎస్సార్బీసీ ఇన్‌చార్జ్ ఎస్ఈ సుభకుమార్ శనివారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 14వ తేదీన గోరుకల్లు ఓటీ ద్వారా ఎస్సార్బీసీకి నీటిని విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం గోరుకల్లు జలాశయంలో మూడు టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. కాల్వల మరమ్మతుల పనులు పూర్తి కాగానే బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి గోరుకల్లు జలాశయంలోకి నీటిని వదులుతామన్నారు.

మత్స్యశాఖ జేడీగా హీరానాయక్

కర్నూలు(అగ్రికల్చర్): మత్స్యశాఖ నంద్యాల జిల్లా జాయింట్ డైరెక్టర్‌గా హీరానాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మత్స్యశాఖ కమిషనరేట్‌లో జేడీగా పనిచేస్తున్న ఈయనను పూర్తి అదనపు బాధ్యతలతో నంద్యాల జిల్లా జేడీగా నియమించింది. ఈయన రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇంతవరకు ఇక్కడ జేడీగా పనిచేసిన రాఘవరెడ్డి ఇటీవల పదవీ విరమణ చేశారు. ప్రస్తుతానికి కర్నూలు డీడీ రంగనాథ బాబు ఇన్‌చార్జ్‌గా ఉన్నారు.


శ్రీశైలంలో భక్తుల రద్దీ



మల్లన్న దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచి పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జునస్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మూడు విడతలుగా పలువురు భక్తులు స్వామివారి స్పర్శదర్శనం చేసుకున్నారు. భక్తుల శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.

గ్రీన్‌కోలో గాలిమరలు ఏర్పాటు



పాణ్యం: పిన్నాపురం సమీపంలో గ్రీన్‌కో సంస్థ చేపట్టిన ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పాదన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నీటి పంపింగ్‌తో విద్యుదుత్పత్తి అయ్యే యంత్రాలను ఇటీవల ప్రారంభించారు. అంతకు ముందు సోలార్ ప్యానెళ్ల ద్వారా పవర్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజులుగా విండ్ పవర్ జనరేషన్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రెండు భారీ గాలిమరలు ఏర్పాటు చేశారు. ఒక్కో గాలిమర సుమారు 150 అడుగులు పైగానే ఉంది. మూడు మెగా వాట్ల విద్యుదుత్పత్తి కానుంది. ఒకే చోట జల, సోలార్, పవన విద్యుత్ ఉత్పత్తి అయ్యే ఈ ప్రాజెక్ట్ ఆసియాలోనే అతి పెద్దది కావడం విశేషం.

క్లుప్తంగా

స్నేహితుడి కోసం..

కొలిమిగుండ్ల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడికి స్నేహితులు ఆర్థిక సాయం అందించేందుకు చేతులు కలిపారు. నాలుగు రోజుల క్రితం తిమ్మనాయినపేటకు చెందిన హుశేన్‌బాషా డ్రైవింగ్ లైసెన్స్ కోసం అదే గ్రామానికి చెందిన ఉస్మాన్‌తో కలిసి నంద్యాలకు వెళ్లి బైక్‌లో తిరిగి స్వగ్రామానికి బయలు దేరారు. ఈ క్రమంలోనే నంద్యాల సమీపంలో కోవెలకుంట్ల నుంచి వస్తున్న బస్సును బైక్ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో హుసేన్‌బాషా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. తన మిత్రుడి వైద్యానికి ఎలాగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో చింతలాయిపల్లెకు చెందిన స్నేహితులు సునీల్, హరి, నబీరసూల్ 'ప్లీజ్ హెల్ప్ బ్రదర్' పేరుతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. గ్రూపులో ఉన్న సభ్యుల ద్వారా ఇప్పటి వరకు సుమారు రూ.10వేల మేర సేకరించారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతనికి మరింత మంది దాతలు అండగా నిలుస్తారనే ఈ నిర్ణయం తీసుకున్నామని స్నేహితులు తెలిపారు.

గుర్తుతెలియని యువకుడి మృతి

హొళగుంద:హెబ్బటం–కురుకుంద రోడ్డులోని ఓ పొలం నీటికుంటలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం శనివారం కనిపించింది. ఎవరైన హత్య చేసి ఇక్కడ పడేశారా? ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడా? తదితర వివరాలు తెలియాల్సి ఉంది. వీఆర్‌ఓ లక్ష్మీనారాయణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హొళగుంద హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీరామ్‌నాయక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నీటి కుంటలో పడి మృతి చెంది ఐదారాజులైనట్లు తెలుస్తోందని పోలీసులు తెలిపారు. మృతుని చేతులపై అమ్మ అని కన్నడ, డీకే అని ఇంగ్లిష్ అక్షరాలలో పచ్చబొట్లు ఉన్నాయని చెప్పారు.

ప్రదర్శనల మాటున పంచుకుతిన్నారు!

- జాతీయ ఆహార భద్రతా మిషన్ నిధులు స్వాహా !
- ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటుకు ఉమ్మడి జిల్లాకు రూ.5.45 కోట్లు విడుదల
- కాగితాలు, కంప్యూటర్లలోనే ప్రదర్శన క్షేత్రాలు
- నాటి జూనియర్ అసిస్టెంటు చేతి వాటంతో స్వాహా పర్వం

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. ఏ శాఖలో చూసినా ఇదే పరిస్థితి. వ్యవసాయ శాఖలో వివిధ పథకాలకు సంబంధించిన ప్రగతిని కాగితాల్లో చూపి నిధులు కొల్లగొట్టడం సర్వసాధారణమైంది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ జాతీయ ఆహార భద్రతా మిషన్(ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం), ఎస్‌ఎంఈవో–వోఎస్ కింద పప్పుదినుసులు, తృణ ధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తిని పెంచేందుకు క్లస్టర్ డెమాన్‌స్ట్రేషన్ ప్రోత్సహిస్తోంది. ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం నే నేడు ఫుడ్ అండ్ న్యూట్రీషియన్ స్కీమ్‌గా వ్యవహరిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 2024–25లో క్లస్టర్ డెమాన్‌స్ట్రేషన్‌లను కాగితాలపై చూపి నిధులను కొల్లగొట్టినట్లుగా వ్యవసాయశాఖలోని జోరుగా చర్చ జరుగుతోంది. కర్నూలు జిల్లాకు ఎఫ్‌ఎన్‌ఎస్ కింద రూ.1.82 కోట్లు, ఎస్‌ఎంఈవో–వోఎస్ కింద రూ.53.7 లక్షల ప్రకారం రూ.2.35 కోట్లు, నంద్యాల జిల్లాకు ఎఫ్‌ఎన్‌ఎస్ కింద రూ.2.07 కోట్లు, ఎస్‌ఎంఈవో–వోఎస్ కింద రూ.49.53 లక్షలు ప్రకారం రూ.2.56 కోట్లు విడుదల అయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ప్రతి మండలానికి ఇందుకోసం రూ.7 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు విడుదల చేశారు. పప్పుదినుసులు, తృణ ధాన్యాలు, పత్తి, నూనె గింజల్లో వేరుశనగ, ఆముదం, ప్రొద్దుతిరుగుడు పంటల సాగును ప్రోత్సహించేందుకు కేంద్రం క్లస్టర్ డెమాన్‌స్ట్రేషన్‌లను చేపడుతోంది. 2014–15 నుంచి 2018–19 వరకు టీడీపీ అధికారంలో ఉన్నపుడు ఇదే జాతీయ ఆహార భద్రతా మిషన్ నిధులను ఒక జూనియర్ అసిస్టెంటు దాదాపు రూ.కోటీ స్వాహా చేశారు. ఈ వ్యవహారం పలువురు అధికారుల మెడకు చుట్టుకుంది. అదే తరహాలోనే 2024–25 ఆర్థిక సంవత్సరంలో వీటికి సంబంధించిన నిధులు పక్కదారి పట్టాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ నిధులతో క్లస్టర్ డెమాన్‌స్ట్రేషన్‌లు ఏర్పాటు చేస్తున్నారనే విషయం రైతుభరోసా కేంద్రాల ఇన్‌చార్జీలకు, వ్యవసాయ విస్తరణ అధికారులకు తెలియదు. 2024–25లో ఎలాంటి వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలను చూడ లేదు.. ఈ–క్రాప్‌లో నమోదు చేయలేదని వారు పేర్కొంటున్నారు. అంటే గట్టుచప్పుడు కాకుండా నిధుల ఆరగింపు ప్రక్రియను చేపట్టినట్లు తెలుస్తోంది.

ధర్డ్‌పార్టీ, వ్యవసాయ అధికారుల కుమ్మక్కు...

వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలకు వివిధ రకాల ఇన్‌పుట్ ఇస్తారు. ఇన్‌పుట్స్‌ను కొన్ని ప్రభుత్వ సంస్థలు, మరికొన్నింటిని ప్రయివేటు సంస్థలు సరఫరా చేయాల్సి ఉంది. వీటినే థర్డ్‌పార్టీగా వ్యవహరిస్తారు. థర్డ్‌పార్టీలు, అధికారులు కుమ్మక్కై జాతీయ ఆహార భద్రత మిషన్ నిధులను కొల్లగొడుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. థర్డ్‌పార్టీలకు కమీషన్‌లు ముట్టచెప్పి నిధులు మళ్లించుకుంటున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ పరిస్థితి దాదాపు అన్ని మండలాల్లో ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఇటీవల జరిగిన బదిలీల్లో కొందరు వ్యవసాయ అధికారులు మంచి పోస్టింగ్ కోసం కూటమి పార్టీల నేతలకు భారీ ఎత్తున ముడుపులు సమర్పించుకున్న విషయం బహిరంగ రహస్యమే. వారిలో కొందరు జాతీయ ఆహార భద్రత పథకం కింద విడుదలైన నిధులను కొల్లగొట్టి ముడుపులుగా ఇచ్చుకున్నారనే చర్చ వ్యవసాయ శాఖలోనే జరుగుతోంది.

శిక్షణ పేరుతో రూ.15 లక్షలు స్వాహా...

జాతీయ ఆహార భద్రతా మిషన్ కింద పత్తికొండ సబ్ డివిజన్‌లో రైతులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంది. ఈ కార్యక్రమాలు కేవలం పత్తికొండ సబ్ డివిజన్‌కు మాత్రమే ఇవ్వడం గమనార్హం. అయితే శిక్షణా కార్యక్రమాలు నిర్వహించకుండానే నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. పొలంబడి, పొలం పిలుస్తోంది అనే కార్యక్రమాలు జిల్లా అంతటా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లోనే జాతీయ ఆహార భద్రత పథకం కింద శిక్షణా కార్యక్రమాలు అంటూ ఫ్లెక్సీలు పెట్టి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్లు మమ అనిపించి నిధులు స్వాహా చేశారనే ప్రచారం వ్యవసాయశాఖలో జోరుగా జరుగుతోంది. ట్రైనింగ్ ప్రోగ్రాంలు కేవలం పత్తికొండ సబ్ డివిజన్‌కు మాత్రమే ఇచ్చి వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు అపారమైన ప్రేమ చాటుకున్నారనే చర్చ జరుగుతోంది.

ఈ సారి ఇన్‌పుట్ సరఫరా బాధ్యత మార్క్‌ఫెడ్‌కు...

క్లస్టర్ డెమాన్‌స్ట్రేషన్‌లు ఏర్పాటు చేయకుండానే చేసినట్లు చూపి జాతీయ ఆహార భద్రత మిషన్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారనే విషయం ఉన్నతస్థాయికి చేరినట్లు తెలుస్తోంది. అక్రమాలను నిరోధించేందుకు ఇన్‌పుట్ సరఫరా చేసే బాధ్యతను మార్క్‌ఫెడ్‌కు అప్పగించినట్లు సమాచారం. 2024–25లో ఇన్‌పుట్స్‌ను కొన్ని ప్రయివేటు సంస్థలు సరఫరా చేశాయి. ఇందు వల్ల అధికారులు ఈ సంస్థలతో కుమ్మక్కై నిధులను మళ్లించుకున్నట్లు తెలుస్తోంది. 2025–26లో ఇన్‌పుట్స్ సరఫరా చేసే బాధ్యతను మార్క్‌ఫెడ్‌కు అప్పగించినట్లు సమాచారం.

మాతృభాష పరిరక్షణ మనందరి బాధ్యత

- రాష్ట్రస్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సులో వక్తలు
- తెలుగుతల్లి విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు భాషాభిమానుల పాదయాత్ర



తెలుగు భాష పరిరక్షణ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ ముక్తేశ్వరరావు

కర్నూలు కల్చరల్: మాతృభాష పరిరక్షణ మనందరి బాధ్యత అని విశ్రాంత ఐఏఎస్ ముక్తేశ్వరరావు అన్నారు. కర్నూలు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు శనివారం ప్రారంభమైంది. ఓల్డ్‌సిటీలోని తెలుగు తల్లి విగ్రహానికి భాషాభిమానులు పూలమాలలు వేసి అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయలు, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి స్మరించుకున్నారు. సదస్సులో ముక్తేశ్వరరావు మాట్లాడుతూ.. తెలుగు అధికార భాషగా ఉన్న రాష్ట్రంలో చట్టాలు, శాసన సభల తీర్మానాలు ఆంగ్లంలోనే వస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆంగ్లప్రదేశ్‌గా మారకుండా చుద్దామన్నారు.

ప్రభుత్వం దృష్టికి తీర్మానాలు

తమిళనాడు రాష్ట్రం తెలుగు భాషా సంఘం అధ్యక్షులు తూమాటి సంజీవరావు మాట్లాడుతూ మాతృభాషను స్పష్టంగా నేర్చుకున్న వారు ఉన్నతంగా రాణిస్తారన్నారు. సదస్సు సమన్వయకర్త పత్తి ఓబులయ్య, సదస్సు అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర, ఉపాధ్యక్షులు జేఎస్ఆర్కే శర్మ, కార్యదర్శి డాక్టర్ దండబోయిన పార్వతీ దేవి మాట్లాడుతూ.. తెలుగు భాష పరిరక్షణకు ఒక వేదికను ఏర్పాటు చేసి రాష్ట్రస్థాయి సదస్సును కర్నూలులో నిర్వహిస్తున్నామన్నారు. సదస్సులో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు చేసిన ప్రతి పాదనలను తీర్మానాలుగా చేసి కలెక్టర్ల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రెండో రోజు జరిగే సదస్సులో బోధనా భాషగా తెలుగు, మాతృ భాషగా తెలుగు, అధికార భాషగా తెలుగు, ప్రథమ భాషగా తెలుగు అనే అంశాలపై చర్చిస్తామన్నారు.

పుస్తకావిష్కరణ

నరసం అధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ, డీఎస్పీ మహబుబ్ బాషా, జంధ్యాల శరత్ బాబు, సోమయాజులు, ఈదర గోపీచంద్, స్వర్ణ రామిరెడ్డి, సహదేవ నాయుడు, మూల మల్లికార్జున రెడ్డి, తరపట్ల సత్యనారాయణ, డాక్టర్ అశోక్ కుమార్ తదితరులు మాట్లాడారు. మధ్యాహ్నం నుంచి వివిధ జిల్లాల ప్రతినిధులు వారి మనోభావాలను పంచుకున్నారు. ముక్తేశ్వరరావు రచించిన 'అప్పుడు రాష్ట్రం కోసం.. ఇప్పుడు భాష కోసం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలుగు భాష పరిరక్షణకు రాష్ట్ర స్థాయి కార్యవర్గం ఏర్పాటు అవసరమని అభిప్రాయపడ్డారు. అతిథులు తెలుగు భాషా ఔన్నత్యాన్ని వివరిస్తూ పాడిన పాటలు, పద్యాలు ఆకట్టుకున్నాయి. నృత్య గురువు కరీముల్లా శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. గాయని సుజాత పాడిన పాటలు ప్రత్యేకంగా నిలిచాయి. సాహితీ వేత్తలు శతావధాని మద్దూరు రామ్మూర్తి, డాక్టర్ వి.పోతన్న, గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, ఎస్‌డీవీ అజీజ్ పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు

- ఐఏబీ సమావేశంలో మంత్రులు బీసీ, ఫరూక్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

నంద్యాల: సాగునీటి ప్రాజెక్టుల కింద ఆయకట్టులోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఫరూక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆధ్వర్యంలో జిల్లా నీటిపారుదల సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, భూమా అఖిల ప్రియ, గిత్త జయసూర్య, జిల్లాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు బీసీ, ఫరూక్ మాట్లాడుతూ.. గోరుకల్లు రిజర్వాయర్ ద్వారా కడప, నంద్యాల జిల్లాలో దాదాపు 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్‌కు వరద రావడంతో తెలుగు గంగ మినహా అన్నీ ప్రాజెక్టులలకు సోమవారం నుంచి నీటిని విడుదల చేస్తామన్నారు. రైతులు నీటి వృథాను అరికట్టి వచ్చే రబీ సీజన్‌కు వరకు నీరు నిల్వ ఉండేలా చూడాలన్నారు. జిల్లాలో అధిక శాతం వరి సాగు చేయడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, సీజనల్ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ నీటిపారుదలశాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో రైతుల సాగు నీటి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. జిల్లాలో లస్కర్ల కొరత ఉందని, ఆ పోస్టులను భర్తీ చేసి సమస్య పరిష్కరించాలన్నారు. సమావేశంలో సాగు నీటి సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

శ్రీశైలం డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

కర్నూలు సిటీ: ఎగువ నుంచి శ్రీశైలం రిజర్వాయర్‌లోకి వస్తున్న నీరు తగ్గింది. దీంతో శుక్రవారం సాయంత్రం ఒక గేటు, శనివారం మరో రెండు గేట్లు మూత వేశారు. ప్రస్తుతం ఒక గేటు ద్వారా, పవర్‌జనరేషన్ ద్వారా మాత్రమే దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. వారం రోజుల క్రితం నాగార్జున సాగర్ (పూర్తి స్థాయి సామర్థ్యం 312 టీఎంసీలు)లో 151..6 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ప్రస్తుతం 205 టీఎంసీలకు చేరింది. కృష్ణాబేసిన్‌లో ప్రస్తుతం వర్షాలు దాదాపు నిలిచిపోయాయి. ఇన్‌ఫ్లో తగ్గిపోవడంతో టీబీ డ్యాం నుంచి నీటి విడుదల తగ్గింది. పోతిరెడ్డిపాడు ద్వారా విడుదల చేస్తున్న నీటిలో 75 శాతం తెలుగుగంగ ద్వారా వెలుగోడుకు, మిగిలిన 25 శాతం నీరు కేసీ ఎస్కేపు చానల్ ద్వారా విడుదల చేస్తున్నారు. హంద్రీనీవా, గోరుకల్లుకు నీటి విడుదల చేయకపోవడం..శ్రీశైలంలోకి నీటి ప్రవాహం తగ్గడంతో 'ఆయకట్టుకు నీరొస్తుందా' అనే ఆందోళన రైతుల్లో నెలకొంది.

కేసీకి నేటి నుంచి నీటి విడుదల!

సుంకేసుల నుంచి తుంగభద్ర జలాలను నేటి(ఆదివారం)నుంచి కేసీ కెనాల్‌కు విడుదల చేయనున్నారు. కేసీకి తుంగభద్ర జలాల్లో 39.9 టీఎంసీల నికర జలాల వాటా ఉంది. ఇందులో 29.9 టీఎంసీలు నది వరద నీటి ప్రవాహం నుంచి, మిగిలిన 10 టీఎంసీల నీరు టీబీ డ్యాం నిల్వ నీటి నుంచి వినియోగించుకోవాలి. ఉమ్మడి జిల్లాలో 1.72 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఖరీఫ్‌లో సాగు చేయనున్న ఆయకట్టుకు నీటిని విడుదల చేసేందుకు ఇంజినీర్లు ఏర్పాట్లు చేశారు.

చాగలమర్రిలో దొంగ హల్‌చల్

- ఐదు ఇళ్లలో చోరీకి యత్నం



చోరీకి యత్నించిన యువకుడు (సీసీ పుటేజీలోని చిత్రం)

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలో ఓ దొంగ హల్‌చల్ చేశాడు. శనివారం తెల్లవారుజామున స్థానిక మెయిన్ బజారులో ఉన్న బైసాని మురళి అనే వ్యక్తికి చెందిన కిరాణ షాపుతో పాటు మరో దుకాణం తాళాలు పగులగొట్టాడు. అయితే లోపలి వైపు వాకిలి ఉండటంతో అక్కడి నుండి వెళ్లి పోయాడు. అలాగే చిన్నమాకానం వైపు ఉన్న తొమ్మండ్రు గురుప్రసాద్, సుంకు ఆనంద్, గాంధీ సెంటర్ సమీపంలో రామాలయం ఎదురుగా ఉన్న బింగుమళ్ల సుదర్శన్ ఇంటి ప్రధాన ద్వారాలు పగులగొట్టాడు. అయితే ఏ ఇంటి లోపలికి వెళ్లలేదు. దుండగుడి చర్యలు సీసీ రికార్డుల్లో నమోదయ్యాయి. సీసీ పుటేజీలో కనిపించిన నిందితుడు చాగలమర్రికి చెందిన యువకుడిగా ప్రజలు చర్చించుకుంటున్నారు.

కాటసాని ఓబులరెడ్డిపై కేసు నమోదు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కాటసాని ఓబులరెడ్డిపై కేసు నమోదైంది. అయితే రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాలతో పోలీసులు అక్రమ కేసు నమోదు చేసినట్లు చర్చ జరుగుతోంది. ఇందుకు సంబంధించిన వివరాలు.. బనగానపల్లె పట్టణ శివారులోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో శనివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు భరోసా కల్పించేలా కాటసాని ఓబులరెడ్డి ప్రసంగించారు. ఆయన మాటలు సభ్యసమాజం హర్షించదగ్గ విధంగా లేవని పోలీసులు కాటసాని ఓబులరెడ్డిపై 153ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఫిర్యాదుదారుడి వివరాలు పోలీసులు వెల్లడించేందుకు నిరాకరించారు. వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు భరోసా కల్పించేలా మాట్లాడినందుకు పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నారు.

మూడు లక్షల ఉద్యోగాలు ఊడగొట్టిన ఘనుడు బాబు

- డీవైఎఫ్ఐ రాష్ట్రకార్యదర్శి రామన్న



మాట్లాడుతున్న రామన్న

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ఉన్న ఉద్యోగుల్లో మూడు లక్షల మంది తొలగించారని డీవైఎఫ్ఐ రాష్ట్రకార్యదర్శి జి.రామన్న విమర్శించారు. యువతీ, యువకులకు సీఎం చంద్రబాబునాయుడు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. కార్మిక, కర్షక భవన్‌లో శనివారం డీవైఎఫ్ఐ 19వ జిల్లా మహాసభలు జరిగాయి. ముందుగా జిల్లా అధ్యక్షుడు జెండావిష్కరణ చేశారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభకు డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, రిటైర్డ్ వైద్యుడు శంకర్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా జి.రామన్న మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే జనవరిలో ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి చంద్రబాబు పట్టించుకోవడంలేదన్నారు. ఏడాది కాలంలోని వలంటీర్లు, ఎండీయూ ఆపరేటర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది దాదాపు మూడు లక్షల మంది తొలగించి ఉపాధికి దూరం చేశారన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3వేల చొప్పున నిరుద్యోగభృతి ఇవ్వాలన్నారు. స్థానికంగా పరిశ్రమలు స్థాపించి ఉద్యోగ, ఉపాధి కల్పన చేయాలని కోరారు. జిల్లా నాయకులువీరేష్, హుస్సేన్‌బాషా, దాసు, సురేష్, శిరీష పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో ప్రచార, సమాచార చట్టం విభాగాల ఏర్పాటు



కర్నూలు (టౌన్): జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార, సమాచార హక్కు చట్టం విభాగ కమిటీలను నియమించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ రెండు కమిటీలకు సంబంధించి పార్టీ నాయకులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేసింది.

జిల్లా ప్రచార విభాగ కమిటీలో...

ఉపాధ్యక్షులుగా చెన్న రాజు (కర్నూలు), మల్లికార్జున (ఆలూరు), ప్రధాన కార్యదర్శులుగా ఎస్. లడ్డుకమల్ (పత్తికొండ), ఈ. నగేష్ (మంత్రాలయం), శ్రీధర్ రెడ్డి (కోడుమూరు), ఎస్. అఖిల్ (ఆదోని), నాగులదిన్నె మహమ్మద్ (ఎమ్మిగనూరు), పి.ఆనంద్ (పాణ్యం), ఎం. పూర్ణ (కర్నూలు), కార్యదర్శులుగా ఉప్పరిగిరి (ఎమ్మిగనూరు) పి. రవికుమార్ (పత్తికొండ), ప్రేమ్‌కుమార్ (ఆలూరు), సీ.బీ. ఆకాష్ రెడ్డి (మంత్రాలయం), నరసింహా రెడ్డి (కోడుమూరు), యం. నరసింహా (ఆదోని), ఎస్‌వీఎస్. రామక్రిష్ణ రెడ్డి (పాణ్యం), ఎస్. రఫీక్ (కర్నూలు), కార్యనిర్వాహక సభ్యులుగా కె. శేఖర్ బాబు (పత్తికొండ), అనిల్ రెడ్డి (ఆలూరు), బి. ఈరెన్న (మంత్రాలయం), కె. పులి శేఖర్ (ఆదోని), ఈ. శ్రీనివాసులు (పాణ్యం), గోపాల్, నాగరాజు (కర్నూలు), రవి ప్రకాష్ రెడ్డి (కోడుమూరు)లు నియమితులయ్యారు.

జిల్లా సమాచార హక్కు చట్టం విభాగ కమిటీలో...

ఉపాధ్యక్షులుగా రాజు (ఆలూరు), బింగి బలరామ్ (ఆదోని), ప్రధాన కార్యదర్శులుగా బి. నాగభూషణం రెడ్డి (పత్తికొండ), బి. శంకర్ (కర్నూలు), బి. కె. రామక్రిష్ణ (మంత్రాలయం), కార్యదర్శులుగా బాసిత్ (ఎమ్మిగనూరు), ఎస్. అనంత రెడ్డి (పత్తికొండ), బద్రి (ఆలూరు), బి. ప్రతాప్ (మంత్రాలయం), దస్తగిరి (కోడుమూరు), హెచ్. మారెప్ప (ఆదోని), జయలక్ష్మీ (కర్నూలు), కార్యనిర్వాహక సభ్యులుగా డి. ఖాజ (ఎమ్మిగనూరు), టీ. సురేష్ (పత్తికొండ), హనుమంతు (ఆలూరు), కె.డి. సాధిక్ (మంత్రాలయం), గుమ్మల దేవదాస్ (ఆదోని)లను నియమించారు.